## క్లుప్తంగా

### న్యాయ సహాయం అందిస్తాం



ప్రత్తిపాడు ఉప కారాగారంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న కార్యదర్శి శ్రీలక్ష్మి

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు ఉప కారాగారాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఉప కారాగారంలోని వంటశాల, పరిసరాల పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర వసతులను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, రికార్డులను పరిశీలించి ముద్దాయిలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే న్యాయ సహాయం అందించేందుకు న్యాయవాదులున్నారా అని పలువురి ముద్దాయిలతో మాట్లాడారు. న్యాయ సహాయం కావాలంటే అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. కారాగారంలో ఉన్న ఫిర్యాదుల పెట్టెను తెరిచి చూసి, ఫిర్యాదులు ఏమీ లేకపోవడంతో తాళం వేయించారు.

### ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు సత్కారం

**ఏలేశ్వరం:** మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులతో ఈ ఏడాది ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో సత్కరించారు. గ్రామానికి చెందిన పాటల పావని, బీశెట్టి నవ్యరత్న, కల్ల కీర్తనదుర్గ ఇటీవల ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంతో జెడ్పీ ఉన్నత పాఠశాలలో వారికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### కార్యకర్తకు పరామర్శ



ప్రసాద్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

**తుని:** పట్టణంలోని 30వ వార్డుకు చెందిన చొక్కా ప్రసాద్‌ను ఇటీవల ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మంగళవారం బాధితుడిని పరామర్శించారు. బాధితుడి ఇంటికి వెళ్లి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అన్నవరం శ్రీను, రేలంగి రమణాగౌడ్, కౌన్సిలర్ కర్రి సత్య జగదీష్, శివ భాస్కరరావు పాల్గొన్నారు.

### సచివాలయంలో డీడీఓ తనిఖీలు

**గండేపల్లి:** డీడీఓ (డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా) ఎం.శ్యామల ఇటీవల బాధ్యతలు చేపట్టి తొలిసారిగా మండలంలోని మల్లేపల్లిలో సచివాలయం-2లో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అందుబాటులో లేని సిబ్బంది గురించి ఆరాతీశారు. మూమెంట్ రిజిస్టర్‌లో ప్రతి విషయాన్ని నమోదుచేయాలని, సచివాలయంలో ఉన్న సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం గండేపల్లి మండల కార్యాలయానికి వెళ్లారు.

**సచివాలయం-1పై నివేదిక ఇవ్వండి**

సిబ్బంది పనితీరుపై సాక్షిలో వచ్చిన కథనంపై ఆమె స్పందిస్తూ మల్లేపల్లి సచివాలయం-1లో పలు శాఖల సిబ్బంది పనితీరుపై నివేదిక సమర్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రరావును ఆదేశించారు. సచివాలయంలో పనితీరును ప్రతి నిత్యం తనిఖీ చేయాలని, పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలతో మమేకం అయ్యేలా చూడాలన్నారు. ఒక దశలో సిబ్బందిని ఆమె వెనకేసుకురావడం గమనార్హం.

### ఐదుగురు జూదరుల అరెస్టు

**జగ్గంపేట:** జగ్గంపేట శివారు గోకవరం రోడ్డులోని పోలవరం కాలువ పక్కన అనుకుని ఉన్న ఓ రహస్య ప్రదేశంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై జగ్గంపేట ఎస్సై రఘునంథన్‌రావు సిబ్బందితో మంగళవారం దాడి చేసారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ 10,110 స్వాధీనం చేసుకున్నారు.

### డెంగీతో యువకుడు మృతి

**శంఖవరం:** మండలంలోని కత్తిపూడిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో డెంగీతో యువకుడు మృతి చెందాడు. బంధువులు వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం యూజే పురం గ్రామానికి చెందిన చిందాడ వేణుబాబు(18) జ్వరం రావడంతో నాలుగు రోజులు క్రితం కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. డెంగీ నిర్ధారణ కావడంతో చికిత్స పొందుతూ యువకుడు మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న బంధువులు ఆసుపత్రి ఎదుట వైద్యం వికటించడంతోనే యువకుడు మృతి చెందినట్లు తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు.

# అందని సర్కార్ వైద్యం

- ప్రభుత్వాసుపత్రుల్లో రోగుల అవస్థలు
- అందుబాటులో లేని మందులు, సిబ్బంది
- ప్రైవేట్ ల్యాబ్‌లో రక్త పరీక్షలు
- ప్రైవేట్ ఆసుపత్రులకు రోగులు క్యూ



తుని ఏరియా ఆసుపత్రి ఓపీ విభాగం



వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

**తుని:** పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీహెచ్‌సీల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయి. మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆశించే పేదలకు నిరాశే మిగులుతున్నది. రూ.కోట్లు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ పేదలకు మాత్రం వైద్యం అందని ద్రాక్షలా మారింది. వర్షాలు కారణంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల భారిన పడుతున్నారు. మండల స్థాయిలో పీహెచ్‌సీల్లో అవసరమైన చికిత్స అందకపోవడంతో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రితో పాటు ప్రవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలు పడి ఆసుపత్రికి వస్తే అరకొర వైద్య సేవలు మాత్రమే అందుతుండడంతో రోగుల బాధ వర్ణనాతీతం. ప్రవేటు ఆసుపత్రులకు వెళ్తే అవసరం లేక పోయినా పరీక్షల పేరుతో జేబులు గుల్ల అవుతున్నాయి. మంగళవారం సాక్షి బృందం ఆసుపత్రుల్లో నిర్వహించిన విజిట్‌లో పలు అంశాలు వెలుగు చూశాయి.

**ఇదీ పరిస్థితి**

తుని, ప్రత్తిపాడు, పాయకరావుపేట నియోజకవర్గాల పరిధిలోని ప్రజలకు ప్రధాన వైద్య సేవలకు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వీటితో పాటు మండలాల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. తుని పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటికి రోజూ 1,500 వరకు వివిధ రకాల వ్యాధులతో సతమతమవుతున్న రోగులు వస్తుంటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చిన్న రోగాలకు మాత్రమే వైద్యం అందిస్తున్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్ తదితర వాటి కోసం తుని ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాలకు చెందిన వ్యాధులకు సంబంధించిన మెడిషిన్ అందుబాటులో ఉంది. సీజనల్ వ్యాధులకు సంబంధించి ఉచితంగా మందులు అందిస్తున్నారు.

**ఆర్థిక భారం**

గర్భిణులకు థైరాయిడ్ టెస్టులు మాత్రం ఆశా వర్కర్లు ప్రవేటు ల్యాబ్‌ల్లో చేయించి ఆసుపత్రికి తీసుకువెళ్తున్నారు. దింతో రోగులకు చేతి చమురు వదులుతుంది. సర్కార్ ఆసుపత్రికి ఉచితంగా వైద్యం దొరుకుతుందని వస్తే జేబులు గుల్ల చేస్తున్నారని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాత్రం అద్భుతంగా వైద్య సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటుంది. క్షేత్ర స్థాయిలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని, ప్రభుత్వాసుపత్రుల్లో అరకొరక వసతులతో ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు క్యూ కడుతున్నారు.

**అధునాతన సదుపాయాలు**

గత ప్రభుత్వ హయాంలో తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అధునాతన సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చాం. అన్ని రకాల వ్యాధులకు మందులు ఉచితంగా అందించారు. మాతా శిశు విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాం. ఆసుపత్రికి వచ్చే రోగులతో పాటు సహాయకులకు ఉచితంగా మూడు పూట్ల ఆహారం సొంత సొమ్ముతో ఏర్పాటు చేశాం. అన్ని విభాగాల్లోనూ అవినీతి లేకుండా చర్యలు తీసుకున్నాను. ప్రజలు ఆసుపత్రికి వచ్చి వైద్యం పొంది సంతోషంగా ఇంటికి వెళ్లేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అందుకు భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యానికి సొమ్ములు వసూలు చేస్తున్నారు. పలువురు ఈ విషయాన్ని నా దృష్టికి తీసుకువచ్చారు.

–దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు మాజీమంత్రి, తుని

**మందుల కొరత లేదు**

ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రక్త పరీక్షలు ఆసుపత్రి ల్యాబ్‌లోనే చేస్తున్నారు. అన్ని విభాగలకు చెందిన వైద్యులు, సిబ్బంది ఉన్నారు. ఎవరికి ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా బయటకు మందులు, రక్త పరీక్షలు చేయించాలని చెబితే నా దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాను.

–డాక్టర్ స్వప్న, ఆసుపత్రి సూపరింటెంట్,తుని

## విత్తనాల పంపిణీలో వివాదం



రైతు సేవాకేంద్రం వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

**రౌతులపూడి:** తొలకరి ప్రారంభం కావటంతో ప్రభుత్వం రాయితీపై అందించే వరి విత్తనాలను మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. 2537 (ఆర్‌జీఎల్) రకం వరి విత్తనాలను తొలివిడతగా 50టన్నులు దిగమతి అయ్యాయని వ్యవసాధికారి తెలిపారు. మండలంలోని పదిహేడు సచివాలయాల పరిధిలో ఈ విత్తనాలను పంపిణీ చేస్తామన్నారు. రౌతులపూడి రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందజేశారు. మిగిలిన సచివాలయాల్లోను ఆయా గ్రామాల స్థానిక ప్రజా ప్రతినిధులు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు ఏఓ పేర్కొన్నారు.

**ప్రొటోకాల్ ఉల్లంఘన**

రౌతులపూడి రైతుసేవా కేంద్రం వద్ద నిర్వహించిన ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే వరి విత్తనాల పంపిణీ కార్యక్రమంలో మంగళవారం అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘించారని స్థానిక సర్పంచ్ కటారి అర్జునమ్మ మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన ఏవిధమైన ప్రొటోకాల్ లేని వ్యక్తులతో పంపిణీ కార్యక్రమం చేపట్టారని ఆమె ఆరోపించారు. దళిత కుటుంబం కావటంతో గ్రామ తొలి పౌరురాలైన తనను ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవకుండా అధికారులు తరచూ అవమానిస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

## జిరాయితీ భూములుగా మార్చాలి



తహసీల్దార్ జె.చిరంజీవికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**కిర్లంపూడి:** భూదాన భూములను తక్షణమే జిరాయితీ భూములుగా మార్చాలంటూ పలువురు రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ పూర్వీకుల నుంచి తమ ఆధీనంలో ఉన్న భూములను జిరాయితీ భూములుగా మార్చాలంటూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్ఓ జె.చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు భూదాన భూములను 22ఏ జాబితాలో చేర్చి జిరాయితీ భూములుగా మార్చడానికి చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయిందని నిషేధిత భూములు జాబితాలో తమ భూములు ఉండడం వల్ల క్రియ, విక్రయాలకు నిలిచిపోయాయన్నారు. సమస్య పరిష్కారానికై పలుమార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్న ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిషేధిత జాబితా నుంచి తమ భూములను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరకణం భద్రం, దాడి పెదబుజ్జి, బుద్ధ సాయిబాబు, పాలిమేరు రాంబాబు, కర్రి వెంకట రమణమూర్తి, శరకణం సంతోష్ తదితరులు ఉన్నారు.

### ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నిక

**గోకవరం:** గోకవరం ఆర్టీసీ డిపోలోని ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికల మంగళవారం జరిగింది. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నల్ల వీరబాబు, పైడిమళ్ల లక్ష్మణరావులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమం అనంతరం డిపో సమస్యలపై డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్‌కు వినతి పత్రం అందించారు. డిజిటల్ చార్టులు అమలు విషయంలో నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, సిబ్బంది వసతి గదుల్లో వసతులు సమకూర్చాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జి.చిరంజీవి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టివి ప్రసాద్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ, చీకట్ల వెంకటేష్, ఎస్ఎస్ నారాయణ, అప్పాజీ, గౌరీశంకర్, శ్రీనివాస్‌రావు, ఎస్ఆర్‌కె దొర తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో బూత్ కన్వీనర్ మృతి



అప్పలనాయుడు (ఫైల్)

**కోటనందూరు:** బొద్దవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ పెతకంశెట్టి అప్పలనాయుడు (42) గుండెపోటుతో సోమవారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక పార్టీ నాయకులు వేగి అప్పలనాయుడు, దొడ్డి బాబ్జీ, యల్లపు సత్యన్నారాయణ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు.

### నేడు సత్యదేవుని హుండీల లెక్కింపు

**అన్నవరం:** అన్నవరంలోని శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని హుండీలను బుధవారం తెరిచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. ఆషాఢం మాసోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో హుండీలను లెక్కించనున్నట్లు ఈఓ వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు.

### ఏడిస్ దోమతోనే డెంగీ వస్తుంది

**శంఖవరం:** డెంగీ వ్యాధి కారణంగానే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతాయని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్యశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తూరు గ్రామంలో ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ కుట్టడం వలన డెంగీ వస్తుందని, ఈ దోమ పగటి పూట మాత్రమే కుడుతుందన్నారు. వ్యాధికి ప్రత్యేక చికిత్స అంటూ ఏమి లేదు. లక్షణాలకనుగుణంగా చికిత్స పొందాలన్నారు.

### ముద్రగడ విజయానికి కృషి చేస్తా

**ఏలేశ్వరం:** వైఎస్సార్ సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పేకల జాన్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల నగర పంచాయతీ ఉపాధ్యక్షుడుగా ఆయన ఎన్నికయ్యారు. పార్టీశ్రేణులు ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను పూర్తిస్థాయి నెరవేరుస్తానన్నారు. సీఎంగా వైఎస్‌జగన్, ఎమ్మెల్యేగా ముద్రగడ గిరిబాబు విజయానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

### అక్రమ నిర్మాణంపై నోటీసులు

**గండేపల్లి:** మండలంలోని నీలాద్రిరావుపేట పరిధి పెద జగ్గమ్మ చెరువులో గోకవరం రోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న అక్రమ నిర్మాణానికి సంబంధించి సంబంధిత వ్యక్తులకు మంగళవారం నోటీసులు జారీ చేసినట్టు గ్రామ పంచాయితీ కార్యదర్శి బాలు వీరేంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌అండ్ బీ అధికారులను సంప్రదించి, సర్వే అనంతరం రికార్ట్స్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### ఘర్షణలకు దిగకండి

**జగ్గంపేట:** గ్రామాల్లో సల్ప విషయాలకే ఇరువర్గాలు వివాదాలకు దిగడం, మాటామాట పెరిగి ఘర్షణలకు దిగడం సరికాదని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ అన్నారు. జగ్గంపేట స్టేషన్‌కు మంగళవారం వివిధ గ్రామాల నుంచి ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారికి ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. శాంతి భద్రతల సమస్యలు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని వెంటనే వాటిని సిబ్బందితో పరిష్కరిస్తామని తెలిపారు. అంతే తప్ప గొడవలు పడి కొట్టుకోవడం, కేసులు పెట్టుకోవడం సరికాదని వారికి వివరించారు.

## మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం




మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

**తుని రూరల్:** ప్రమాదకర మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో యువత చురుగ్గా పాల్గొనాలని, మాదక ద్రవ్యాల నివారణ సమాజిక బాధ్యతగా గుర్తించాలని రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి అన్నారు. మంగళవారం వి.కొత్తూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్.లలిత ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసులతో కలిసి విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన సదస్సు, ర్యాలీ, మానవహారం నిర్వహించారు. రూరల్ ఎస్సై కృష్ణమాచారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత, ఎన్నో కుటుంబాల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. మాదక ద్రవ్యాలు వాడడంవల్ల కలిగే నష్టాలు, చట్టపరంగా ఎదురయ్యే కఠిన చర్యలను వివరించారు. సామాజిక బాధ్యతగా మాదక ద్రవ్యాలను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, రూరల్ పోలీసులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయంతో ఇక్కట్లు



మల్లేపల్లి సచివాలయం-2లో సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీదారులు

**గండేపల్లి:** విద్యుత్‌శాఖ సమాచార లోపంతో సచివాలయ అర్జీదారుల, స్థానికులు ఇక్కట్లు పడిన వైనమిది. మండలంలోని మల్లేపల్లి కొత్తూరు సెంటర్‌లో మంగళవారం కొత్త లైన్ వేస్తుండటంతో విద్యుత్‌ను నిలిపివేశారు. విద్యుత్ లేకపోవడంతో సంత మార్కెట్ సమీపంలో గల సచివాలయం-2కి రేషన్ కార్డ్స్, విద్యుత్ బిల్లులు, ఒన్ బీ, ఆధార్ సీడింగ్, అడంగల్, తదితర అవసరాల కోసం వచ్చిన అర్జీదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడి వెనుదిరగాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. విద్యుత్‌శాఖ ముందస్తు సమాచారం గాని ఎటువంటి ప్రకటనలు తెలపకపోవడంతో సచివాలయంలో కొన్ని శాఖలకు చెందిన సిబ్బంది అర్జీదారుల పనులను వాయిదావేయాల్సి వచ్చిందని, పనులకు తీవ్ర అంతరాయం కలిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. ముందస్తు సమాచారం తెలిపి ఉంటే ప్రత్యామ్నాయంతో అర్జీదారుల పనులు పూర్తిచేసే అవకాశం ఉండేదని స్థానికులు అంటున్నారు. సమాచారం కోసం గ్రామ ఏఎల్ఎంకు ఫోన్ చేస్తే సరైన స్పందన లేదని పలువురు ఆరోపించారు. దీనిపై ఏఈని వివరణ కోరగా ప్రకటన, సమాచారం తెలియపరచకపోవడం వాస్తవమేనన్నారు.

## ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ ఆపాలి

- రైతుల్లో ఆందోళన
- 2,500 హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు
- ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుపై డిమాండ్



కార్యాచరణపై చర్చిస్తున్న మూడు మండలాల రైతులు

**ఏలేశ్వరం:** ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ ఆపాలని మంగళవారం ఆయిల్ పామ్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తుందని సమాచారం తెలుసుకున్న మూడు మండలాల రైతులు పట్టణంలో సమావేశమయ్యారు. ఆయిల్‌ఫెడ్ ప్రైవేటీకరణను ప్రభుత్వం అడ్డుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైతులకు వెన్నెముకగా నిలిచే ఆయిల్‌పామ్ ధరను నిర్ణయించే ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేటీకరణ చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో 2,500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ జరుగుతుందని ఈ ఏడాది ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్న మరో 500 హెక్టార్లలో సాగు పెరిగే అవకాశం ఉందన్నారు.

**సాగు మరింత విస్తీర్ణం**

ప్రస్తుతం 22వేల టన్నుల ఫ్యాక్టరీకి పంపుతున్నామని వచ్చే కాలంలో సాగు 4వేల హెక్టార్లకు పెరిగి 40 టన్నుల సామర్థ్యం వస్తుందన్నారు. కొన్ని ప్రైవేట్ కంపెనీలు తమ ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు ఆయిల్‌ఫెడ్‌ను ప్రైవేటీకరించే దిశగా కుట్రలు పన్నుతున్నాయని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం ఈ మూడు మండలాల పరిధిలో మినీ ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు సామంతుల సత్యనారాయణ, నడిమింటి ప్రసాద్, పంతం చక్రవర్తి, శివాజీరాజు, విశ్వనాథ రాజు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### దేవస్థానంలో పారిశుధ్యం మెరుగుపడాలి



ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న త్రినాథరావు

**అన్నవరం:** రాష్ట్రంలో ప్రముఖ దేవస్థానాలకు విచ్చేస్తున్న భక్తుల్లో అసంతృప్తి శాతం రోజు రోజుకు పెరిగిపోతోందని రాష్ట్ర ప్రభుత్వ సర్వేలలో వెల్లడవుతుండడంతో దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అన్నవరం, సింహాచలం, వాడపల్లి దేవస్థానాలకు ప్రత్యేక అధికారిగా ఆర్‌జేసీ (రాజమహేంద్రవరం) త్రినాథరావును నియమించారు. మంగళవారం సాయంత్రం రత్నగిరికి విచ్చేసిన ఆయన వివిధ ప్రదేశాలలో టాయిలెట్స్‌ను పరిశీలించారు. పాత మెయిన్ గెస్ట్ హౌస్ వెనుక సుమారు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన టాయిలెట్స్ శిథిలావస్థకు చేరినందున వాటిని కూల్చేయాలని సూచించారు. ఆయనతో దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, ఈఈ రామకృష్ణ, ఏఈఓలు ఇతర అధికారులు ఉన్నారు.

### 11 గ్రామాలకు నేడు కరెంట్ కట్

**ప్రత్తిపాడు:** మండలంలోని వివిధ గ్రామాల్లోని 11 కేవీ ఫీడర్లలో కొత్త లైన్లు పునరుద్ధరణ, విభజన నిమిత్తం 11 గ్రామాలకు బుధవారం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. చినశంకర్లపూడి ఫీడర్‌లోని లంపకలోవ, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పి.జగన్నాథపురం గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

**ప్రత్తిపాడు రూరల్:** పెద్దిపాలెం, ఉత్తరకంచి ఫీడర్ల పరిధిలో పెద్దిపాలెం, వేములపాలెం, గోకవరం, మెట్టుచింత, రౌతుపాలెం, ఉత్తరకంచి, 11కేవీ చినశంకర్లపూడి ఫీడర్ పరిధిలో లంపకలోవ, పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి, పీజే పురం గ్రామాలకు, ఎంఎస్ఎస్ఎల్ ఫీడర్ పరిధిలోని వంతాడ గ్రామాలకు నేడు ఉదయం 9.గంటల నుంచి మధ్యాహ్నం 12.గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని వినియోగాదారులు అంతరాయానికి సహకరించాలని ఈఈ కోరారు.

### సొంత మండలాలకు బదిలీ చేయాలి

**ప్రత్తిపాడు:** సచివాలయాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి, సొంత మండలాలకు బదిలీ చేయాలని మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ డిమాండ్ చేసింది. స్థానిక మండల కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబుకు అందజేశారు. మండల అసోసియేషన్ అధ్యక్షుడు బండారు రామనరసింహమూర్తి మాట్లాడుతూ తమ సర్వీసుకు ఆరేళ్లు నిండినా ప్రమోషన్లు కల్పించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమోషన్లు, స్వంత మండలాల్లో పనిచేసే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నెల్లిపూడి రవి, కారే అమృతవర్షిణి, గొనగాని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన గ్రామాల్లో సదస్సులు

**ప్రత్తిపాడు:** ధాత్రి అలాజస్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ జెజీయుఏ) కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉపప్రణాళికా ప్రాంతాలైన పాండవులపాలెం, బవురువాక గిరిజన గ్రామాల్లో ఈనెల 25న సదస్సులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఉదయం 10.గంటలకు పాండవులపాలెం ఆశ్రమ పాఠశాల ఆవరణలోనూ. మధ్యాహ్నం 2.గంటలకు బవురువాక సచివాలయంలోనూ ఈ సదస్సులు జరుగుతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు ప్రేరణ కల్పించడం తదితర అంశాలపై మండల స్థాయి కమిటీతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ నోడల్ అధికారిగా ఉండే ఈ కమిటీలో తహసీల్దార్‌తో పాటు వైద్య ఆరోగ్య, వ్యవసాయ, గిరిజన, ఐసీడీఎస్ తదతర శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

### బదిలీలపై ప్రభుత్వానికి స్పష్టత లేదు



ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

**గండేపల్లి:** గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వానికి సరైన స్పష్టతలేదని సచివాలయ ఉద్యోగ సిబ్బంది ఆరోపించారు. సొంత మండలంలో పనిచేసుకునే వెసులుబాటు, ట్రాన్స్‌ఫర్స్ స్పష్టత, హేతుబద్ధీకరణ అనంతరం మిగులు ఉద్యోగులపై స్పష్టత, ప్రమోషన్లు, నోషనల్ ఇంక్రిమెంట్స్‌పై ప్రకటన, తదితర అంశాలపై మంగళవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రరావుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సొంత మండలంలో పనిచేసుకునే వీలు కల్పించకపోతే తక్కువ వేతనాలు పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని, బదిలీలా ప్రక్రియ సజావుగా పారదర్శకంగా జరగాలని, పని, ఆర్థిక భారంతో మానసికంగా ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఉద్యోగులు పేర్కొన్నారు.

### అంబేడ్కర్ గురుకులాల్లో కౌన్సెలింగ్

**తుని రూరల్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదట సంవత్సరం కౌన్సెలింగ్ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్టు వి.కొత్తూరు కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష రాసినా సీటు పొందని అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చన్నారు. కాకినాడ శివారు పండూరు (పి.వెంకటాపురం) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఉదయం తొమ్మిది గంటలకు అభ్యర్థులు హాజరుకావాలన్నారు. సీఈసీ, ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొవాలన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్



సీసీ కెమెరా ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి

**గండేపల్లి:** మండల కేంద్రం గండేపల్లిలో హైవేని ఆనుకుని ఉన్న సచివాలయం-2కు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సచివాలయం ముంగిట అల్లరిమూకల చేష్టలు అనే శీర్షికతో మంగళవారం ఓ కథనం ప్రచురితమైంది. కథనానికి స్పందించిన అధికారులు సచివాలయం ఆరు బయట, లోపలి వైపు రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు పంచాయతీ కార్యదర్శి కె.ఫణీంద్ర తెలిపారు.